క్లుప్తంగా

రెవెన్యూ పాలనను గాడిలో పెడతా..


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్వో కేవీ నారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): పాలనను గాడిలో పెట్టి ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చేస్తానని డీఆర్వో కేవీ నారాయణమ్మ అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు చెప్పవచ్చన్నారు. కలెక్టరేట్ సుందరీకరణ, పార్కింగ్ అంశాలపై దృష్టి సారిస్తానని చెప్పారు.

ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని భవన నిర్మాణ సంఘం నగర ప్రధాన కార్యదర్శులు కాజాపాషా, అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇసుక దొరక్క కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. తద్వారా వారి కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. సీఐటీయూ నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నిక


ఎన్నికైన పవర్ డిప్లొమా ఇంజినీర్స్ సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ: కర్నూలు, నంద్యాల జిల్లాల పవర్ డిప్లొమా ఇంజినీర్స్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.వి.శేషిరెడ్డి తెలిపారు. నగరంలోని ఆ సంఘం అతిథి గృహంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నాగభూషణం, నాగరాజును, కార్యనిర్వహణ కార్యదర్శిగా లోకేష్, కోశాధికారిగా శంకర్‌ను ఎన్నుకున్నా రు. నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జ్ఞాన సూర్యుడు, రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగేశ్వరరెడ్డి, కోశాధికారిగా సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

బేడ, బుడగ జంగాలకు న్యాయం చేయాలి


కమిషన్ సభ్యుడు రామ్‌చందర్‌కు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగం నేతలు

కర్నూలు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బేడ, బుడగ జంగం కులానికి న్యాయం చేస్తామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ హామీ ఇచ్చినట్లు ఆ సంక్షేమ సమితి నేతలు తెలిపారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న తమ కుల సమస్యకు పరిష్కారం చూపాలని సోమవారం న్యూఢిల్లీలో జాతీయ కమిషన్ సభ్యులు రామ్‌చందర్‌ను కలిసి వినతి పత్రం అందించినట్లు సంఘం నేతలు తెలిపారు. సమస్య ఆగిందో తెలుసుకొని ఎలా పరిష్కరించాలనే విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారన్నారు.

సాయినాథ్ నగర్‌లో చోరీ

కర్నూలు కల్చరల్: స్థానిక సాయినాథ్ నగర్‌లో సోమవారం పట్టపగలు దొంగతనం జరిగింది. కాలనీలో నివాసం ఉండే యాపిలయ్య, అతని భార్య డోన్ డివిజన్‌లో వెలుగులో పనిచేస్తారు. సోమవారం యథావిధిగా తమ విధులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన దొంగలు లోపలికి చొరబడి దొంగతనం చేశారు. యాపిలయ్య దంపతులు డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించారు. 22 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గ్రహించి నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ బదిలీ

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ అంకిరెడ్డి తన మాతృ శాఖ హెల్త్ డిపార్టుమెంట్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం తన చాంబర్‌లో ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ముందుగా బదిలీపై వెళ్తున్న డాక్టర్ అంకిరెడ్డిని మున్సిపల్ కమిషనర్, అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా నంద్యాల ప్రజలకు ఆయన అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ మురళీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఓ(అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్) శ్రీవాణి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బరువు ఎత్తేసి.. పతకాలు పట్టేసి

- సత్తా చాటుతున్న జిల్లా క్రీడాకారిణి షేక్ రేష్మా బేగం
- కర్నూలు నుంచి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక
- పోటీలతో పాటు రెఫరీగా రాణిస్తున్న వైనం
- స్టేడియంలో మహిళలకు హాలు కేటాయిస్తే మరిన్ని ఫలితాలు





అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ట్రోఫీ అందుకుంటున్న షేక్ రేష్మా బేగం, జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న రేష్మా, పవర్ లిఫ్టింగ్ పోటీలకు రెఫరీగా వ్యవహరిస్తూ..

కర్నూలు (టౌన్): మహిళలు వంటింటికే పరిమితం అనే రోజులు పోయాయి. పురుషులకు దీటుగా మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. బరువులు ఎత్తడం పురుషులకు సంబంధించిన క్రీడ కాదని జిల్లా క్రీడాకారులు ఎన్నో సార్లు నిరూపించారు. ఇప్పటికే కర్నూలుకు చెందిన షేక్ రేష్మా బేగం పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. కర్నూలు నుంచి జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయి, అంతర్జాతీయ స్థాయి వరకు తన ‘పవర్’ను చాటింది. పతకాలు సాధించింది. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో మన దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన ఈమెకు మన అధికారులు, ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లేదు. పతకాలు సాధిస్తున్న ఆమె కష్టపడి రెఫరీ పరీక్షల్లోనూ పాసయ్యింది. ఇప్పుడు రెఫరీలో కూడా రాణిస్తూ పోటీలను చక్కగా నిర్వహిస్తు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఓ వైపు ప్రాక్టీసు చేస్తు అవకాశం వచ్చినప్పుడల్లా రెఫరీగా రాణిస్తోంది.

పవర్ ఉన్నా.. ప్రోత్సాహం లేక

పవర్ లిఫ్టింగ్‌లో ఎన్నో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారిణికి సరైన గుర్తింపు లభించలేదు. 2007 నుంచి స్టేడియంలో అడపాదడపా ప్రాక్టీసు చేస్తుంది. మాస్టర్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పూర్తి చేసింది. బరువులు ఎత్తడం అంటే పురుషులకే సాధ్యం అనే రోజుల్లో నిత్యం సాధన చేస్తూ ఎన్నో సార్లు ప్రతిభ చాటింది. ఇక జిల్లా కలెక్టర్ సైతం ఆమెను ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు. పాల్గొన్న అనేక ఈవెంట్లలో రేష్మా బంగారు పతకాలు సాధించింది. పోటీల్లో పాల్గొంటే పతకం ఖాయం. రాష్ట్ర స్థాయిలోనే మెడల్స్ సాధించింది. అయితే సరైన ప్రోత్సాహం లేక మరింత ముందుకు పోలేని పరిస్థితి ఉంది. ఆర్థికంగా అంతంత మాత్రమే ఉన్న ఈ క్రీడాకారిణికి ప్రోత్సాహం కరువైంది. పవర్‌లిఫ్టింగ్‌లో జిల్లా, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారిణికి సహాయ సహకారాలు అందిస్తే మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉంటుంది.

లిఫ్టర్ రేష్మా సాధించిన విజయాలు

- 2013లో అనకాపల్లిలో 57 కిలోల విభాగంలో బంగారు పతకం
- నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం
- 2019లో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం
- 2022లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం
- 2022 సంవత్సరంలో జగ్గయ్య పేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది.
- ఈ ఏడాది మంగళగిరిలో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం సాధించింది.

స్టేడియంలో మహిళలకు హాలు కేటాయించాలి

జిల్లాలో ఎంతో మంది మహిళలు ఇటీవల కాలంలో పవర్ లిఫ్టింగ్‌లో విజయాలు సాధిస్తున్నారు. అయితే స్టేడియంలో ఒకే హాలు ఉంది. పురుషులకు, మహిళలకు ఒకే హాలు వినియోగించుకోవడం ఇబ్బందిగా మారింది. స్టేడియంలోనే ఏదో ఒక హాలు కేటాయిస్తే మహిళా క్రీడాకారులకు సౌకర్యవంతంగా ఉంటుందని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు. స్కూల్‌గేమ్స్ క్రీడల్లోనూ 20కి పైగా మహిళలు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటేందుకు ఉత్సాహం చూపిస్తున్నా సౌకర్యాలు లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. ఆ దిశగా ఏలాంటి ఖర్చు లేకుండా స్టేడియంలోనే మహిళలకు ఒక గది కేటాయిస్తే జిల్లాకు మరిన్ని పతకాలు తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పవర్ లిఫ్టర్లు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

9 నుంచి తిరుమలకు పాదయాత్ర

కర్నూలు కల్చరల్: భక్తి చైతన్య పాదయాత్ర కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 9వ తేదీ నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టినట్లు కమిటీ సభ్యులు పాలూరి శివయ్య, ఎం.కె. శ్రీనివాసులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది 13వ సారి వేంకటేశ్వర స్వామి రథంతో పాటు భక్తి చైతన్య మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 7 గంటలకు కర్నూలు ఓల్డ్‌సిటీలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. 850 మంది భక్తులు 12 రోజుల పాటు పాదయాత్ర చేసి తిరుమలకు చేరుకుంటారని చెప్పారు. నవంబర్ 21వ తేదీన స్వామివారి దర్శనం ఉంటుందని తెలిపారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. పాదయాత్రలో పాల్గొనాలనుకునేవారు, మరిన్ని వివరాలకు 94408 74322, 91544 43337 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో చేపట్టిన హేతుబద్ధీకరణలో ఏఈఓలను మినహాయించాలని జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.చాంద్‌బాషా డిమాండ్ చేశారు. క్లస్టర్ స్థాయిలో పనిచేస్తున్న ఏఈఓలు సీనియర్ అసిస్టెంటు, సూపరింటెండెంటు హోదాలో పనిచేస్తున్నారని, ప్రస్తుతం రికార్డు అసిస్టెంటు స్థాయి కలిగిన వీఏఏ/వీహెచ్ఏ/వీఏఎస్/ ఎంపీఈఓలుగా గ్రామస్థాయిలో నియమిస్తుండటం దారుణమని వాపోయారు. హేతుబద్ధీకరణ నుంచి ఏఈఓలను మినహాయించాలని కోరారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం సమర్పించారు. జిల్లా నాయకులు మనోహర్, జయరాం, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

పందికోన రిజర్వాయర్‌ను పరిశీలించనున్న సీపీఐ బృందం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పందికోన రిజర్వాయర్‌ను పరిశీలించేందుకు సీపీఐ బృందం మంగళవారం వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వాయర్ పనులను పూర్తి చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా నీరు ఇవ్వాలని, ప్రధాన కాలువను విస్తరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ క్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జగదీష్ ఆధ్వర్యంలోని బృందం రిజర్వాయర్‌ను మంగళవారం పరిశీలించి భవిష్యత్ కార్యచరణను ప్రకటించనున్నట్లు ఆయన వివరించారు.

ప్రతి ఇంటా జ్ఞానజ్యోతి వెలగాలి

కర్నూలు కల్చరల్: దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు నాగయ్య, కల్యాణ్ అన్నారు. ఈ నెల 31వ తేదీ దీపావళి పండుగను పురస్కరించుకొని సోమవారం సంతోష్ నగర్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సంక్షిప్తం

జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడనడానికి గుర్తుగా దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలన్నారు. సభ్యులు మధువాణి, ప్రమీల, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడేశారు.. ఆదుకోండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న తమను అకారణంగా విధులనుంచి తొలగించి పొట్టకొట్టారని, ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడిన తమను ఆదుకోవాలని బాధితులు చంద్రబాబు, మద్దిలేటి, యోగేష్, సురేష్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఉద్యోగులను వేధించడం మొదలు పెట్టిందని, జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించమని అడిగితే పని నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏజెన్సీ సూపర్‌వైజర్లు ఫిరోజ్‌ఖాన్, రవితేజ ఉద్యోగులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పని నుంచి తొలగిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

కర్నూలు కల్చరల్: క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాస నిర్మాణానికి దోహదపడతాయని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్ అన్నారు. నవంబర్ 9వ తేదీన నిర్వహించనున్న యూనివర్సిటీ వ్యవసాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వర్సిటీలో ఉద్యోగులు, విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, త్రోబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రీడాస్ఫూర్తి, స్నేహభావం, పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాల్ కృపాకర్, టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి


వినతులను స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా దృష్టి సారించి అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 21 మంది ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి, ఎంఈలు సత్యనారాయణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ జునైద్ పాల్గొన్నారు.

సమస్యలపై వచ్చిన అర్జీల్లో కొన్ని..

- సుందరయ్య పార్కు, పార్థసారథి నగర్ పార్కులను అభివృద్ధి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు పుల్లారెడ్డి విన్నవించారు.
- టిడ్కో గృహానికి చెల్లించిన డీడీలను వాపసు ఇప్పించాలని పలువురు అర్జీలు అందజేశారు.
- సీతారాం నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లను పునర్నిర్మించాలని స్థానికులు సయ్యద్ చిన్నహుసేన్ విన్నవించారు. నాగేంద్రనగర్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, శ్రీశైల నగర్, రాధా నగర్, రేణుక నగర్‌లో రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలని స్థానిక కాలనీ అసోసియేషన్ నాయకులు కమిషనర్‌కు విన్నవించారు.
- బాబా బృందావన్ నగర్ కాలనీ, సుభాష్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేయాలని వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, సోమశేఖర్ కోరారు.
- వీకర్ సెక్షన్ కాలనీలోని శ్రీనివాస నగర్, సిద్ధి వినాయక్ నగర్‌లో మట్టి రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు వరలక్ష్మి, రఘు, సామ్యేల్ వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.
- పెద్దపాడు సమీపంలోని మైత్రి హోమ్స్, శ్రీరాం రెసిడెన్సీ, బాలాజీ నగర్, బృందావన్ కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికవాసులు విన్నవించారు.
- 16, 19, 20, 29, 37, 38 వార్డుల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి


కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఇసుకను ఇతర రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేయకుండా నియంత్రించేందుకు సరిహద్దుల్లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నదీ పరివాహక గ్రామాల ప్రజలు పంచాయతీ సెక్రటరీల అనుమతితో సొంత పనులు, గ్రామ అవసరాలు, కమ్యూనిటీ పనుల కోసం ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. బోర్లు, ఎండిన బావుల దగ్గర ఇసుకను తీయకుండా వీఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, గనుల శాఖ డీడీ రవిచందన్ పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలను పక్కాగా నిర్వహించండి

జిల్లాలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు నిర్వహించే విజిలెన్స్ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణలో భాగంగా సమగ్రత, అవినీతి నిర్మూలన, లంచం నిర్మూలన వంటి అంశాలపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, జనసమూహాల్లో అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ నాయకులు గోరంట్లప్ప, మద్దిలేటి, నాగేంద్ర ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వ్యక్తిత్వ వికాస గ్రంథం భగవద్గీత

కర్నూలు కల్చరల్: భగవద్గీత సమస్త మానవాళిని ఉద్ధరించే వ్యక్తిత్వ వికాస గ్రంథమని తెలుగు పండితులు గరుడాద్రి వనజ కుమారి అన్నారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ‘రమ ఏకాదశి’ని పురస్కరించుకొని సోమవారం సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనను తాను సముద్ధరించుటకు భగవద్గీత గ్రంథం ఉపకరిస్తుందన్నారు. గీతా ప్రచార సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, గీతా రత్న పురస్కార గ్రహీత డీవీ రమణ మాట్లాడారు. సంఘం సభ్యులు సింహాద్రి రమేష్, రమణ, జగన్నాథ గుప్త, మహాబలేష్, పుల్లారెడ్డి, డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ బుక్‌లెట్ ఆవిష్కరణ


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ముద్రించిన బుక్‌లెట్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆవిష్కరిచారు. ఆయన సోమవారం సునయన ఆడిటోరియంలో బుక్‌లెట్‌ను ఆవిష్కరించి రైతులకు చేరేలా చూడాలని అధికారులకు సూచించారు. బుక్‌లెట్‌ను హ్యాండ్‌బుక్, ప్యాకెట్ బుక్ రూపంలో ముద్రించడంతో ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లడానికి వీలుంటుందన్నారు. 25 మండలాల్లోని 141 రైతు సేవా కేంద్రాలు, 247 గ్రామైక్య సంఘాల్లోని మహిళలకు ఈ బుక్‌లెట్లు చేరేలా చూడాలని ఆదేశించారు. బుక్‌లెట్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను చక్కగా వివరించారని కితాబిచ్చారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): రక్తదానం మరొకరికి ప్రాణ దానం అవుతుందని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఎస్పీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మ కల్పించడమేనన్నారు. ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ జ్యూస్, బిస్కెట్లు అందజేశారు.


అక్రమ బంకులు తొలగించాలి

కర్నూలు (టౌన్): స్థానిక సి.క్యాంపు మున్సిపల్ స్కూల్ వద్ద విద్యార్థినుల బాత్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన బంకులను తొలగించాలన్న డిమాండ్‌తో ఈనెల 31 వ తేదీన ధర్నా చేపట్టనున్నట్లు నగరపాలక వైఎస్సార్‌సీపీ 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి స్పష్టం చేశారు. ఆమె సోమవారం మాట్లాడుతూ.. ఈనెల 25 వ తేదీన జరిగిన నగర పాలక సర్వసభ్య సమావేశంలో సమస్యను మంత్రి టీజీ భరత్, కమిషనర్ రవీంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. వారి నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ, సమస్య పరిష్కారమే లక్ష్యంగా ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): నగర శివారు బి.తాండ్రపాడులోని క్రైడో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రావ్య లక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి చదువుతున్న సమన్విత సత్యసాయి జిల్లా లేపాక్షిలో అలాగే పదో తరగతి చదువుతున్న భార్గవ్ రెడ్డి బాపట్ల పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కార్తీక్, హెడ్ కోచ్ అగ్నివేష్, కోచ్ రవి అభినందించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


వీకర్ సెక్షన్ కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

కర్నూలు (టౌన్): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సోమవారం కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 75 మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రౌడీ షీటర్లకు, అనుమానితులకు కౌన్సిలింగ్ చేశారు. అలాగే అనుమానితుల ఇళ్లల్లో దాడులు చేశారు. వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు పారితోషికం అందిస్తామన్నారు. అలాగే ఎలాంటి ధ్రువ పత్రాలు లేని 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ప్రవీణ్‌కుమార్, నాగరాజరావు, పవన్ కుమార్, పార్థసారథి రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యురేనియం పేరుతో పల్లెలను నాశనం చేయొద్దు

- కలెక్టరేట్ ఎదుట కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి, జిల్లెడుబడకల ప్రజల ఆందోళన


యురేనియం తవ్వకాలు ఆపాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కర్నూలు(సెంట్రల్): యురేనియం తవ్వకాల పేరిట పచ్చని పల్లెలను నాశనం చేయొద్దని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి, జిల్లెడుబుడకల గ్రామాల రైతులు నిరసనకు దిగారు. ఆయా గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు తమ గ్రామాలను నాశనం చేయొద్దని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యురేనియం తవ్వకాలు చేపడితే రైతులు సర్వనాశనం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పండే భూముల్లో యురేనియం కోసం తవ్వకాలు జరిపితే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. తమ గ్రామాలను రక్షించుకోవడానికి ఎందాకైనా సిద్ధమని, ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు.